క్లుప్తంగా

రీవాల్యూయేషన్ గడువు పొడిగించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ఎస్‌ఆర్ బీజీఎన్‌ఆర్ కాలేజీలో మూడో, ఐదో సెమిస్టర్ రీవాల్యూయేషన్ దరఖాస్తు గడువు పొడిగించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వొంగూరి వెంకటేష్ మాట్లాడుతూ..... విద్యార్థులు ఎక్కువగా గ్రామల్లో ఉండటంతో నెట్‌వర్క్ సమస్యల వల్ల ఆన్‌లైన్‌లో ఇబ్బందులు ఎదురై చాలా మంది అప్లై చేసుకోలేకపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే గడువు పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, వరుణ్, నిఖిల్, అన్వేష్, అనిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


శ్రీపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న పీఆర్‌టీయూ, పీఆర్‌పీఏ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: విద్య, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయగా ఆయనను పీఆర్‌టీయూ జిల్లా బాధ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, ప్రోగ్రెసివ్ రిక గ్నైజ్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ (పీఆర్‌పీఏ)రాష్ట్ర అధ్యక్షులు మోతుకూరి మధు, ప్రధాన కార్యదర్శి కందుల వెంకటనర్సయ్య, నాయకులు కెవి.రమణ, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

'న్యాయవాది అరెస్ట్ గర్హనీయం'

ఖమ్మం లీగల్: నిందితులకు బెయిల్ కోసం పెట్టిన ష్యూరిటీలు నకిలీవని వచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో న్యాయవాది షేక్ లతీఫ్‌ను అరెస్ట్ చేసే క్రమంలో పోలీసులు వ్యవహరించిన తీరు న్యాయవ్యవస్థను కించపరిచేలా ఉందని న్యాయవాదులు అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యాయవాది లతీఫ్‌తోపాటు పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడారు. తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బెయిలబుల్ సెక్షన్లు ఉన్నప్పటికీ, పోలీసులు అక్రమంగా తన ఇంట్లోకి జొరబడ్డారన్నారు. ఈ మేరకు పోలీసుల వైఖరిని ఖండిస్తూ జిల్లా కోర్టులో న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ ఘటనను న్యాయవాదులు పోట్ల మాధవరావు, అమర్ చంద్, ఓరుగంటి శేష గిరిరావు, పి. పట్టాభి, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, బిచ్చాల తిరుమల రావు, న్యాయవాద సంఘాల నాయకులు తదితరులు ఖండించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కోర్ట్
వినోద	మ్యాడ్‌స్క్వేర్
సాయిరాం	సారీ
ఆదిత్య	రాబిన్‌హుడ్
శ్రీనివాస	ఎల్2: ఎంపురాన్, ఆదిత్య 369

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	4
వంకాయ	28		20
బెండకాయ	34	పాలకూర	4
పచ్చిమిర్చి	44		20
కాకర	48	చుక్కకూర	4
బీర	48		20
దొండ	20	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	84	గోంగూర	4
గోరుచిక్కుడు	48		20
క్యాబేజీ	20	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	30	కొత్తిమీర	1
చామగడ్డ	40		30
క్యారెట్	34	పుదీన	1
బీట్‌రూట్	24		20
క్యాప్సికం	54	-ఖమ్మం వ్యవసాయం	

అస్తవ్యస్తంగా దోబీ నిర్వహణ

పెద్దాస్పత్రిలో దుస్తుల శుభ్రతలో నిర్లక్ష్యం

- అపరిశుభ్ర పరిసరాల్లో ఆరేస్తున్న సిబ్బంది
- ఏజెన్సీపై అధికారుల అజమాయిషీ కరువు


భారీ వాషింగ్ మిషన్‌లో దుస్తులు ఉతుకుతున్న సిబ్బంది

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పడకలపై వాడే బెడ్‌షీట్లు, ఆపరేషన్ కోసం వచ్చిన వారికి వినియోగించే దుస్తుల శుభ్రం చేయడంలో ఎక్కడ లేని నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఏళ్లగా ఒక్కరే కాంట్రాక్ట్ నిర్వహిస్తుండటంతో ఆడిందే ఆట, పాడిందే పాట అన్న చందంగా తయారైంది. నామమాత్రంగా దుస్తులను శుభ్రం చేస్తూనే నెలనెలా రూ.12.50 లక్షల బిల్లు తీసుకుంటుండడం గమనార్హం. సాధారణంగా బెడ్‌షీట్లు, ఆపరేషన్ థియేటర్‌లో వినియోగించే దుస్తులను రసాయనాలతో కలిపి నానబెట్టాలి కానీ అలా ఏనాడు చేసిన దాఖలాలే లేవు. ఇదిలా ఉండగా నీటి సరఫరా, కరెంట్, వాషింగ్‌మిషన్లు సమకూర్చటం మొత్తం నిర్వహణ వ్యయం ఆస్పత్రిపై పడుతూ భారంగా తయారైంది. వర్కర్లకు మాత్రమే సదరు కాంట్రాక్టర్ జీతాలు చెల్లిస్తున్నారు. ఈ మాత్రం దానికి కాంట్రాక్టర్‌కు రూ.లక్షల్లో ఎందుకు చెల్లిస్తున్నారో అర్థం కాని ప్రశ్నగా ఉంది.

ప్రతీరోజు మార్చాల్సిందే...

ఆస్పత్రిలో ప్రస్తుతం 575 పడకలకు అనుమతి ఉండగా సీజనల్ వ్యాధుల సమయంలో బెడ్లన్నీ నిండిపోతాయి. ఇక ఇన్‌పేషంట్ రోగుల బెడ్లపై బెడ్‌షీట్లు తరచూ మారుస్తుంటారు. నిబంధనల ప్రకారమైతే ప్రతీరోజు వార్డుల్లో, ఆపరేషన్ థియేటర్లలో వినియోగించిన బెడ్‌షీట్లు, దుస్తులను సేకరించి శుభ్రపరచాలి. కానీ తూతూమంత్రంగా వారికి నచ్చినప్పుడు బెడ్‌షీట్స్ సేకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కోసారి రెండు, మూడు రోజులు కూడా బెడ్‌షీట్లు మార్చట్లేదనే వాదనలున్నాయి. ఒకరోజు పింక్ కలర్ దుస్తులు, మరోరోజు వైట్ కలర్ దుస్తులు ఉతకాలనేది షెడ్యూల్‌గా ఉంది. కాగా, ఆస్పత్రిలోని షెడ్డులో రెండు భారీ వాషింగ్ మిషన్లు ఏర్పాటు చేయగా అవి కూడా ఆస్పత్రికి చెందినవే కావటం గమనార్హం. వాటిలో ఒకటి పక్కన బెట్టగా ఒక్కదానితో నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని దోబీ నిర్వహణ సక్రమంగా జరిగేట్లు చూసి రోగులు మరిన్ని వ్యాధులు బారిన పడకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

సిబ్బందికి అరకొర వేతనాలు

ఇదిలా ఉండగా లాండ్రీ సిబ్బంది శ్రమదోపిడీకి గురవుతున్నారు. ఏడేళ్లుగా ఆస్పత్రికి సంబంధించిన బట్టలు ఉతుకుతున్నా జీతాలు తక్కువే చెల్లిస్తున్నారు. ఇతర సిబ్బందికి రూ.15వేలు చెల్లిస్తుంటే వారికి మాత్రం రూ.7,500 మాత్రమే ఇస్తున్నారని పది మంది లాండ్రీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస వేతనం రూ.21,000లు చెల్లించాలని, పీఎఫ్, ఈయస్ఐ, టీఏ, డీఏ, ఇతర అలవెన్స్‌లు చెల్లించాలని, సిబ్బందిని కూడా పెంచాలని, దోబీఘాట్ నిర్మించాలని బట్టలు ఆరబెట్టడానికి తగిన ఖాళీ ప్రదేశం ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

శుభ్రంగా ఉండేలా చూస్తున్నాం..



ఆస్పత్రిలో రోగుల బెడ్లపై బెడ్‌షీట్లు నిత్యం మార్పిస్తున్నాం. పరిశుభ్రంగా ఉతకాలని ఆదేశాలు ఇచ్చాం. పింక్, వైట్ బెడ్‌షీట్లు ఎప్పటికప్పుడు మార్చేలా చూస్తున్నాం. దుస్తులు టీబీ వార్డు పక్కన ఆరబెడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ప్రత్యామ్నాయం చూడాలని నిర్వాహకులకు చెప్పాం. ఇకపై ఆసుపత్రి ఆవరణకు దూరంగా దుస్తులు ఆరబెట్టేలా చర్యలు తీసుకుంటాం. – ఎల్.కిరణ్‌కుమార్, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్


టీబీ వార్డు పక్కనే ఆరేసిన వస్త్రాలు

టీబీ వార్డు పక్కనే ఆరబెడుతూ..

ఉతికిన దుస్తులను ఆస్పత్రి ఆవరణలోని టీబీ వార్డు పక్కనే ఆరబెడుతున్నారు. నిబంధనల ప్రకారం ఉతికిన దుస్తులను ఆవరణకు దూరంగా ఆరబెట్టాలి. కానీ టీబీ వార్డు పక్కనే ఆరేస్తుండడంతో టీబీ బాధ్యులపై అక్కడక్కడే తిరుగుతుండడంతో దుప్పట్లను ఉతికిన ఫలితం ఉండడం లేదు. ఇక వాషింగ్ మిషన్‌లోనే దుస్తులను ఉతుకుతుండటంతో దోబీఘాట్ అధ్వానంగా తయారైంది. మురికి నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది.


దోబీఘాట్ వద్ద అపరిశుభ్రత

రికార్డులను అప్‌డేట్ చేయాలి


నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రాంబాబు

తిరుమలాయపాలెం: ఆర్థిక సంవత్సరం పూర్తయినందున అన్ని రికార్డులను పూర్తి స్థాయిలో అప్‌డేట్ చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి టి.రాంబాబు ఆదేశించారు. ఈ మేరకు మండలంలోని ఎర్రగడ్డ పంచాయతీ రికార్డులను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటి పన్ను వసూలు, గ్రామసభ, నగదు పుస్తకాలు తనిఖీ పరిశీలించారు. అనంతరం పంచాయతీ నర్సరీ, సేంద్రీయ ఎరువుల తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రజలకు అవసరమైన మొక్కలు పెంచాలని కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పి.సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి మాధవి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మంఅర్బన్: ప్రగతిశీల భవన నిర్మాణ కార్మికసంఘం ఖమ్మం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం నగరంలోని బల్లేపల్లి స్టేజి అడ్డా వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు పేరబోయిన వెంకన్న మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఖండించాలన్నారు. ఈనెల 13న జరగనున్న జిల్లా మహాసభకు కార్మికులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. వేముల ఉపేందర్, రాజు, నరేష్, వెంకన్న, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భీమ్ దీక్ష ముగింపు సభ పోస్టర్లు..

తిరుమలాయపాలెం: రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలో ఈ నెల 13న నిర్వహించే భీమ్ దీక్ష ముగింపు సభను జయప్రదం చేయాలని స్వేరో జిల్లా కోశాధికారి వీవీ.రమణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సభ పోస్టర్లను ఆవిష్కరించారు. మార్చి 15 నుండి ఏప్రిల్ 14 వరకు జరిగే స్వేరో పవిత్ర మాసంలో ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేస్తూ మహనీయులను స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ఐలపొంగు వెంకన్న సహాయ కార్యదర్శి చీమ భూపాలం, నాయకులు శ్రీను, ఉప్పలయ్య నాగేంద్ర స్వేరో పాల్గొన్నారు.

డీలర్లపై విచారణ, నివేదిక

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లిలో పలువురి రేషన్‌కార్డులు తొలగించగా తహసీల్దార్ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ మల్లేష్‌ను కొన్నాళ్ల క్రితం సరెండర్ చేశారు. అయితే, కార్డుల తొలగింపు స్థానిక డీలర్ ప్రమేయంతోనే జరిగిందని ఆయన లేఖ ఇచ్చాడు. దీంతో తహసీల్దార్ జె.మాణిక్‌రావు సోమవారం బైరవునిపల్లి డీలర్ బి.లక్ష్మీనారాయణపై ఆర్‌డీఓకు నివేదిక సమర్పించారు. ఇదిలా ఉండగా తాజాగా అమ్మగూడెం డీలర్ రమేష్‌పై గ్రామానికి చెందిన పి.నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. డీలర్ సమయపాలన పాటించడం లేదని, కార్డుదారులతో దురుసుగా ప్రవర్తిస్తున్నాడని పేర్కొనగా విచారణ చేపట్టాలని ఆర్ఐ రవిని తహసీల్దార్ ఆదేశించారు.

ఆలయానికి పల్లకీలు బహూకరణ

కామేపల్లి: మండలంలోని పండితాపురంలో రామాలయాలకు రూ.40 విలువైన రెండు ఊరేగింపు పల్లకీలను రఘునాథపాలెం మండలం మంచుకొండ శ్రీ ఆదిత్య గాయత్రి స్కూల్ కరస్పాండెంట్ చిన్నం వెంకమరాజు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

ఖమ్మంలీగల్: నగరంలోని వైఎస్సార్ కాలనీలో సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. నగరంలోని మ్యాక్స్ విజన్ కంటి ఆసుపత్రి వైద్యులు వైఎస్సార్ కాలనీ వాసులకు కంటి, బీపీ, మధుమేహ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కెవి.చంద్రశేఖర్‌రావు, ఎస్‌జీఓ అన్నపూర్ణ, హాస్పిటల్ కోఆర్డినేటర్ దేవేందర్, అసిస్టెంట్ డాక్టర్ ప్రశాంత్, కౌన్సిలర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక


కమిటీ నూతన కార్యవర్గం

కామేపల్లి: మండలంలోని పండితాపురం వడ్డెర సంఘం గ్రామ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా తమ్మిశెట్టి రాములు, అధ్యక్షుడిగా దేరంగుల తిరుపయ్య, ఉపాధ్యక్షుడిగా తురక భిక్షం, ప్రధాన కార్యదర్శిగా చల్లా మల్లయ్య, కార్యదర్శులుగా బత్తుల ఉపేందర్, మంజుల వెంకన్న, కోశాధికారి రాయల నాగశంకర్, ప్రచార కార్యదర్శిగా చల్లా వీరబాబు, యువజన కార్యదర్శిగా వల్లెపు ఉమారాజులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన వడ్డెర కులస్తులను ఆదుకోవాలని కోరారు.

రేషన్‌కార్డుల జారీలో ప్రభుత్వ వైఖరి సరికాదు

ఖమ్మం మామిళ్లగూడెం: రేషన్ కార్డుల జారీలో ప్రభుత్వ వైఖరి సరికాదని, అర్హులకు రేషన్ కార్డులు రాకుండా చేసే ప్రయత్నం జరుగుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ఆరోపించారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ నగర సమితి సభ్యుల సమావేశం సోమవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో నగర కార్యదర్శి షేక్ జానిమియా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు ఉన్నాయని రేషన్‌కార్డులను అధికారులు నిలుపుదల చేయాలని చూస్తున్నారని, మారిన పరిస్థితుల్లో కార్డు బతుకు దెరువుగా మారాయన్న వాస్తవాన్ని గుర్తించాలన్నారు. పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, పోటు కళావతి, మహ్మద్ సలాం, వెంకటరెడ్డి, సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాస్, పగడాల మల్లేష్, గాదె లక్ష్మి నారాయణ, తాటి నిర్మల, శంకరయ్య, సాంబశివరెడ్డి, జ్వాల నర్సింహారావు పాల్గొన్నారు.

వైభవంగా పట్టాభిషేక వేడుకలు


పర్ణశాలలో పట్టాభిషేకం వేడుకలు


పట్టాభిషిక్తుడైన స్వామివారు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ ఇందిరానగర్ పర్ణశాల రామాలయంలో సోమవారం రాములోరి పట్టాభిషేకం వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాలయం ప్రాంగణంలో మండపంపై స్వామివారికి పట్టాభిషేకం నిర్వహించారు. ప్రధాన అర్చకులు నారాయణ కృష్ణకిషోర్, ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. దేవాలయ ఈఓ వీవీ నరిసింహారావు, కార్పొరేటర్ చావా మాధురి నారాయణరావు, సభ్యులు కొత్తా రవి, ఎర్ర బసవయ్య,కుమలి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గాంధీచౌక్‌లో..

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని గాంధీచౌక్‌లో నిర్వహించిన శ్రీ రామనవమి వేడుకల్లో భాగంగా సోమవారం సీతారామచంద్ర స్వామి వారికి వైభవంగా పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. పండితులు సాంప్రదాయ పద్ధతుల్లో స్వామి వార్లకు కనకాభిషేకం చేశారు. కమిటీ అధ్యక్షులు వేములపల్లి నగేష్, కార్యదర్శి వజ్రపు రాంమోహన్ రావు, ప్రతినిధులు తెల్లాకుల సాంబశివరావు, ఉమాపూర్ణచందర్‌రావు, ఆత్మకూరి నవీన్, సోముల శ్రీనివాస రావు, అర్వపల్లివనకుమార్ ఉన్నారు.

రోటరీనగర్‌లో చేపల మార్కెట్

- ప్రతిపాదనలపై కలెక్టర్ సమీక్ష


కళాక్షేత్రంలో పనులపై సూచనలిస్తున్న కలెక్టర్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం రోటరీనగర్‌లోని వీధి వ్యాపారుల ప్రాంగణంలో చేపల మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. కొన్నాళ్ల నుంచి ఖాళీగా ఉంటున్న రోటరీనగర్ వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని కలెక్టర్ సోమవారం పరిశీలించారు. లైవ్ ఫిష్ మార్కెట్‌తో పాటు ఫిష్ ఫుడ్‌స్టాళ్ల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రాంగణంలో వివరాలను జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ వెల్లడించగా, మత్స్యకారులకు ప్రయోజనం కలిగేలా ఓ పక్క చేపల అమ్మకం, మరోపక్క వంటకాల స్టాళ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందించాలని తెలిపారు.

ఆధునికీకరణ పనులు...

ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆధునీకరణ పనులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటీరియర్ డెకరేషన్ ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, గోడలకు చిత్రాలు వేయించి, సీట్లు, సౌండ్‌సిస్టమ్‌పై దృష్టి సారించాలని తెలిపారు. జెడ్పీ సీఈవో దీక్షారైనా, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి, డీఈ మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించకుంటే నోటీసులు


అధికారులతో మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ పరిధిలో పన్నులు చెల్లించని షాపింగ్‌మాల్స్, హోటల్స్, బ్యాంక్‌లు, కమర్షియల్ బిల్డింగ్‌లకు నోటీసులు జారీ చేయాలని మేయర్ పునుకొల్లు నీరజ ఆదేశించారు. సోమవారం కేఎంసీ కార్యాలయంలో కమర్షియల్ బిల్డింగ్‌ల అనుమతి, పన్నుల వసూళ్లపై అధికారులతో సమీక్షించారు. ఈ మేరకు పన్ను సకాలంలో చెల్లింపులు, ట్రేడ్ లైసెన్సులు, పర్మిషన్ లేకుండా ఎన్ని కమర్షియల్ బిల్డింగ్స్ ఉన్నాయో గుర్తించి రిపోర్ట్ అందజేయమని సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ వసుంధర, ఆర్ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నీరు నిల్వకుండా నిర్మాణాలు చేపట్టాలి

- కమిషనర్ అభిషేక్ అగస్త్య


14వ డివిజన్‌లో పర్యటిస్తున్న కమిషనర్, తదితరులు

ఖమ్మంఅర్బన్: కాల్వల నిర్మాణంలో ఎలాంటి లోపాలు లేకుండా మురుగు, వాన నీరు నిల్వకుండా పోయేలా నిర్మాణాలు చేయడంతోపాటు, ఉన్న కాల్వలను శుభ్రం చేయాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య సంబంధిత ఇంజనీరింగ్, పారిశుద్ధ్య విభాగాల అధికారులకు సూచించారు. సోమవారం నగరంలోని 14వ డివిజన్‌లో ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాలతో సంయుక్తంగా పర్యటించారు. వర్షపు నీరు, వాడిన నీరు సమర్థవంతంగా వెళ్లేలా తగిన కాల్వలు లేని ప్రాంతాలను కార్పొరేటర్ కూరాకుల వలరాజుతో కలిసి ఆయన పరిశీలించారు. అవసరమైన చోట్ల కాల్వలు లేవన్న విషయాన్ని గుర్తించి, సంబంధిత అధికారులు పూర్తి వివరాలను తెలియజేయాలని కమిషనర్ ఆదేశించారు. ఇప్పటికే ఉన్న కాల్వలను శుభ్రం చేసి వాటిలో నీరు నిరాటంకంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. శానిటేషన్ పనుల పురోగతిని కమిషనర్ సమీక్షించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


సమస్యపై ఆరా తీస్తున్న కమిషనర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని వెంకటగిరిలో ఎస్సీ, బీసీ, జంగాల కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. కాలనీలో సోమవారం కమిషనర్ మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తున్నట్లు తెలిపారు. సమస్య ఉంటే సంబంధిత వార్డు అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంతలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

కామేపల్లి: పండితాపురంలోని శ్రీ కృష్ణప్రసాద్ పశువుల సంతలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఎంపీడీఓ రవీందర్‌కు సోమవారం గ్రామస్తులు వినతిపత్రాన్ని అందించారు. సంతలో రాత్రి సమయంలో విద్యుత్ సౌకర్యం సరిగా లేదని, నీటి సరఫరా సక్రమంగా లేక పశువులు, వ్యాపారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా సంతలో జేబు దొంగతనాలు, పార్కింగ్ చేసిన బైకులు దొంగిలించడం, రోడ్డుపై దుకాణాలు పెట్టడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని పోలీసులు చర్యలు చేపట్టాలని కోరారు.

భూ ఆక్రమణలు అరికట్టాలి

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయి గ్రామంలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ సోమవారం గ్రీవెన్స్‌లో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో నాయకులు అధికారులకు విన్నవించారు. నూతన రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాగేశ్వరరావు, తిమ్మిడి హన్మంతరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, కొమ్ము పూలే, ఉపేందర్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ పంపిణీ

రఘునాథపాలెం: మండలంలోని రేగులచెలక గ్రామానికి చెందిన నున్న రామయ్యకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ రూ.60 వేల పత్రాన్ని సోమవారం మాజీ ఉపసర్పంచ్ యండపల్లి సత్యం అందించారు. నాయకులు పెంట్యాల వీరయ్య, వంకాయలపాటి వేణు, చెల్లమల ముత్తయ్య, కొలిపిన్ని రమేష్, లింగయ్య ఉన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు


మృతదేహం వద్ద ఫౌండేషన్ బాధ్యులు, పోలీసులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ఎఫ్‌సీఐ గోదాంల వద్ద మూడు రోజుల క్రితం గుర్తుతెలియని మృతదేహం ఉండగా.. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు మార్చురీకి తరలించారు. ఇప్పటివరకు మృతదేహం కోసం ఎవరూ రాకపోవడంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో సోమవారం బల్లేపల్లిలోని వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

'ఉపాధి' పనుల పరిశీలన

నేలకొండపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని కోనాయిగూడెం పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్‌కుమార్ సూచించారు. ఈ మేరకు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం పరిశీలించారు. మస్టర్లను పరిశీలించి నిబంధనల మేరకు పనులు చేయాలని కూలీలకు సూచించారు. క్షేత్ర సహాయకుడు తిగుళ్ల భాస్కర్, మాజీ సర్పంచ్ పుల్లమ్మ, మేట్లు కోటయ్య, సీతారామిరెడ్డి, వెంకటరెడ్డి, బాలస్వామి, మాధవి, యశోద, సైదులు, ముత్తయ్య, చంద్రయ్య ఉన్నారు.

కొనుగోలు కేంద్రం వద్ద పడిగాపులు


నిరసన తెలుపుతున్న రైతులు

నేలకొండపల్లి: మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి కాంటాలు వేయకపోవడంతో కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని చెరువుమాధారం గ్రామంలో కొనుగోలు కేంద్రంలో కాంటాలు వేయడం లేదని రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రానికి దాదాపు 2 వేల క్వింటాల వరకు ధాన్యం తీసుకొచ్చామని, సాయంత్రం కాగానే కమ్ముతున్న మబ్బులతో కంటి మీద కునుకు లేకుండా పోయిందని వాపోయారు. కేంద్రం ప్రారంభించి కొనుగోళ్లు చేయట్లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి కొనుగోలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఐకేపీ ఏపీయం ఆర్.శ్రీనివాసరావును వివరణ కోరగా కేంద్రంకు మిల్లు ఎలాట్ కానందున్న కాంటాలు ఆపేశామన్నారు. అన్ని సిద్ధంగా ఉంచామని, మిల్లు కేటాయించగానే కాంటాలు చేపడతామన్నారు.